www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 7 సెప్టెంబర్ 2025
5
అన్నమయ్య



## 'ఆదిత్య'లో 6జి టెక్నాలజీపై అవగాహన

**ప్రజాశక్తి-మదనపల్లె**

పుంగనూరు రోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగం ఆధ్వర్యంలో శనివారం 5జి, 6జి టెక్నాలజీల అనువర్తనాలు, కేస్ స్టడీస్‌అంశంపై ప్రత్యేక టెక్నికల్ టాక్ కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ రామ లింగారెడ్డి తెలిపారు. టెలిమాటిక్స్ అభివృద్ధి కేంద్రం(సి-డాట్), బెంగళూరుకు చెందిన శాస్త్రవేత్త ప్రదీప్ పాల్గొన్నారు. ఆధునిక కమ్యూనికేషన్ రంగంలో వస్తున్న పరిణామాలు, పరిశోధనలు, పరిశ్రమకు కలిగే ప్రయోజనాలపై ఆయన విశ్లేషణాత్మకంగా వివరించారు. ప్రదీప్ మాట్లాడుతూ 5జి ఆరోగ్య సంరక్షణ, స్మార్ట్ సిటీలు, పారిశ్రామిక ఆటోమేషన్, ఆన్‌లైన్ విద్య వంటి రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తుంది. ఇక 6జి టెక్నాలజీ హై-స్పీడ్ నెట్‌వర్క్‌లు, హోలోగ్రాఫిక్ కమ్యూనికేషన్, ఏఐ ఆధారిత స్మార్ట్ సేవల ద్వారా మానవ జీవన ప్రమాణాలను మరింత మెరుగుపరుస్తుందని పేర్కొన్నారు.ప్రారంభోత్సవ కార్యక్రమానికి కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాయుడు, ఇసిఇ విభాగం అధిపతి డాక్టర్ కె.వి.వరప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు హాజరయ్యారు.

# ఎఐఎడబ్ల్యూయు కౌన్సిల్ సమావేశాలకు సన్నాహాలు

- ర్యాలీ, సభల నిర్వహణ ఏర్పాట్లు ముమ్మరం
- జెండాలు, తోరణాల ఏర్పాట్లలో కేడర్ నిమగ్నం
- కడపకు చేరుకున్న ఉత్తరప్రదేశ్, రాజస్తాన్ రాష్ట్రాల ప్రతినిధులు



ఉత్తరప్రదేశ్, రాజస్తాన్ ప్రతినిధులకు స్వాగతం పలుకుతున్న నాయకులు

**ప్రజాశక్తి - కడప ప్రతినిధి**

ఆలిండియా వ్యవసాయ కార్మిక సంఘం కౌన్సిల్ సమావేశాలకు కడప నగరం వేదికైంది. సమావేశాల నిర్వహణ కోసం కసరత్తు ఊపందుకుంది. జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ నాయకత్వం ఈ నెల 8, 9, 10వ తేదీల్లో కడప నగరంలో జాతీయ కౌన్సిల్ సమావేశాల నిర్వహణ ఏర్పాట్లను ముమ్మరం చేసింది. తొలిరోజు నిర్వహించనున్న ర్యాలీకి వ్యవసాయ కార్మికుల సమీకరణ, సభ జయప్రదానికి వేదిక ఏర్పాట్లు చేయడంలో నిమగ్నమైంది. కడప నగరంలోని కీలక కూడళ్లలో జెండాలు, ఎర్రజెండాల తోరణాల ఏర్పాట్లలో వ్యవసాయ కార్మిక సంఘం కేడర్ నిమగ్నమైంది. జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో తోరణాలు ఏర్పాటు చేయాలి, జెండాలు ఎక్కడ ఏర్పాటు చేయాలనే అంశంపై దృష్టి సారించింది. దేశంలోని ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే సుమారు 200 మంది ఆలిండియా, రాష్ట్ర ప్రతినిధులు, రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి వచ్చే యూనియన్ నాయకులకు బస ఏర్పాట్లు, భోజన సదుపాయాలు తదితర అంశాలపై దృష్టి సారించింది. దేశంలోని వ్యవసాయ ప్రాంతాలుగా పేరు గాంచిన ఉత్తరప్రదేశ్, రాజస్తాన్ రాష్ట్రాల నుంచి శనివారం సాయంత్రానికి కడపకు చేరుకున్న ఎనిమిది మంది నాయకులను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి.శివకుమార్ బృందం కడప రైల్వేస్టేషన్‌కు చేరుకుని స్వాగతం పలికింది. అనంతరం వీరికి కడపలో బస, ఇతర సదుపాయాల కల్పనపై దృష్టి సారించింది.



జెండాలు, తోరణాల ఏర్పాటులో నిమగ్నమైన కార్యకర్తలు

# దిగుమతి సుంకం పెంపు దుర్మార్గం

### - నిరసనలో వామపక్ష పార్టీల నాయకులు



అంబేద్కర్ చిత్రపటం వద్ద నిరసన ప్రదర్శన చేస్తున్న వామపక్ష పార్టీల నేతలు

**ప్రజాశక్తి-రాయచోటి అర్బన్**

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారతీయ సరుకుల దిగుమతులపై సుంకాన్ని 50 శాతానికి పెంచడాన్ని నిరసిస్తూ శనివారం రాయచోటిలో వామపక్షాలు నిరసన ప్రదర్శన చేశాయి. రెవెన్యూ కాంప్లెక్స్ పరిధిలోని అంబేద్కర్ చిత్రపటం వద్ద నిరసన చేపట్టారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మహేష్, సిపిఎం జిల్లా నాయకులు రామాంజులు, సిపిఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి మావులూరి విశ్వనాథ్ మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విధించిన 50 శాతం పన్నుల వలన మన దేశ ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం పడిందన్నారు. ఆక్వా, టెక్స్ టైల్స్, గార్మెంట్స్ ఆభరణాలు వజ్రాలు ఎలక్ట్రానిక్ పరికరాలు వంటి ఉత్పత్తుల ధరలు గణనీయంగా పడిపోయాయన్నారు. దేశ సముద్ర ఉత్పత్తుల్లో 40శాతం ఎగుమతులు ఆంధ్రప్రదేశ్ నుంచి అవుతున్నాయని ఏటా సుమారు రూ.2 వేల కోట్ల డాలర్ల విలువైన ఆక్వా ఉత్పత్తులు ఎగుమతి మన రాష్ట్రంనుంచి గుమతి అవుతున్నాయని, ప్రస్తుతం అమెరికా విధించిన 50 శాతం టారిఫ్‌లతో ఆక్వా పరిశ్రమ కుదేలైందన్నారు. గార్మెంట్స్, టెక్స్‌టైల్ రంగాల్లో మన రాష్ట్రంలోనే అనేక జిల్లాలలో ఉన్నటువంటి ఫ్యాక్టరీలు, స్పిన్నింగ్ మిల్లుల్లో పని చేస్తున్న వేలాది మంది కార్మికుల ఉపాధి పోగొట్టుకునే పరిస్థితి ఏర్పడుతున్నదన్నారు. అమెరికా వీసాలకు నిబంధనలు కఠినతరం చేయడం, కాలపరిమితిని తగ్గించడం, జరిమానాలు విధించడం వంటి కారణాలతో ఎన్నో ఆశలతో ఉన్నత విద్యను అభ్యసించాలనే విద్యార్థుల కలలు పేకమేడల్లా కూలిపో తున్నాయని ఇప్పటికే అమెరికా వెళ్లినవారి పరిస్థితి మరింత దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్ని విధాలుగా ట్రంప్ సర్కారు భారత ప్రయోజనా ల్ని, సార్వభౌమత్వాన్ని దెబ్బతీస్తున్నా దేశ ప్రధాని నరేంద్ర మోడీ సర్కారు మాట కూడా మాట్లాడకపోవడం సరికాదని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాల కాపాడేందుకు సిఎం చంద్రబాబు కూడా ఏమాత్రం ప్రయత్నించకపోవడం చూస్తే రాష్ట్ర ప్రయోజనాలు వీరికి పట్టలేదన్నట్టు ఉందన్నారు. కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగల శ్రీనివాసులు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమల్ల రంగారెడ్డి నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు ఓబులేసు, ఆంజనేయులు, రైతు సంఘం నాయకులు హరినాధ నాయుడు, అంజద్ అలీఖాన్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారత సరుకులపై విధించిన 50 శాతం సుంకాన్ని వెంటనే రద్దు చేయాలని సిపిఐ, సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం జాతీయ రహదారిలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద వామపక్షాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చిట్వేలి రవికుమార్, పందికాళ్ల మణి, నాయకులు ఎస్.సికిందర్, డి.వి రమణయ్య, ప్రసాద్, కుమార్, రమణ, నాగేశ్వర్, రాజ శేఖర్, ఆదినారాయణ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

# బొప్పాయి రైతులకు మద్దతు ధర కల్పిస్తాం : కలెక్టర్



బొప్పాయి తోటను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్

**ప్రజాశక్తి-చిట్వేలి**

బొప్పాయి రైతులకు మద్దతు ధర కల్పిస్తామని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. శనివారం మండలంలోని బొప్పాయి రైతుల పంట పొలాలను ప్రత్యక్షంగా సందర్శించారు. మండలంలోని ప్రభాకర్‌రెడ్డి అనే రైతు 35 ఎకరాల్లో, శివరాంరెడ్డి అనే రైతు 10 ఎకరాల్లో బొప్పాయి పంటను సాగు చేసిన పొలాలను పరిశీలించారు. వారి పొలాల్లో పంట పరిస్థితిని సమగ్రంగా పరిశీలించి, ఎన్ని క్రాప్‌లు వస్తాయి? ఒక్కో క్రాప్‌కు ఎంత దిగుబడి వస్తుంది? అనే అంశాలపై రైతులను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ ఢిల్లీ మార్కెట్‌లో బొప్పాయి కిలో ధర రూ.40గా ఉంటే, రైతులకు కేవలం రూ.5 మాత్రమే ఎందుకు చెల్లిస్తున్నారని కలెక్టర్ ప్రశ్నించారు. చిట్వేలి, పెనగలూరు మండలాల్లో బొప్పాయి రైతులకు బొప్పాయి ధర కిలో రూ.8లకు తక్కువ కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆలస్యంగా బొప్పాయి పంట వేయడం వల్ల కోడూరు, ఓబులవారిపల్లె ప్రాంతాలతో ఉన్న రేటు ప్రభావం చిట్వేలి, పెనగలూరు మండలాలకు కూడా వ్యాపిస్తోందని పేర్కొన్నారు. రైతులకు సరైన ధర అందేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. చిట్వేలి, పెనుగులూరు మండలాల్లోని ప్రతి రైతును మానిటర్ చేయాలని, వారి పంట పరిస్థితిని, మార్కెట్‌లో విక్రయ స్థితిని పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు అవసరమైన సమాచారం సరైన సమయంలో చేరేలా విహెచ్‌ఎలు, విఆర్‌ఓలు వంటి గ్రామస్థాయి అధికారులను బొప్పాయి రైతులకు అనుసంధానం చేయాలని, ప్రతి రైతును పర్యవేక్షించేలా వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఉద్యాన శాఖ అధికారి సుభాషిణిని కలెక్టర్ ప్రత్యేకంగా ఆదేశించారు. రైతులకు మార్కెట్ పరిస్థితులు, ధరలపై సరైన అవగాహన కల్పించడం ద్వారా వారికి న్యాయమైన గిట్టుబాటు ధర లభించేలా సమగ్రంగా పనిచేయాలని సూచించారు. బొప్పాయి రైతులకు మార్కెట్‌లో సరైన ధర లభించేలా జిల్లా యంత్రాంగం సమన్వయంగా పనిచేస్తుందని, అవసరమైన సమాచారం అందించేందుకు గ్రామస్థాయిలో ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రైతులు ఆందోళన చెందకుండా, సరైన మార్కెట్ అవకాశాలు కల్పించేలా ప్రభుత్వ యంత్రాంగం కృషి చేస్తోందని హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బొప్పాయి రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. సేట్‌లు, దళారులు కావాలని రైతులను ఇబ్బంది పెట్టితే, వారిని నోట్ చేసి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం పూర్తి బాధ్యతతో వారి ప్రయోజనాలను కాపాడేందుకు పనిచేస్తుందని తెలిపారు.

# ఆర్థిక, విద్యా రంగ సమస్యలపై రణభేరి : యుటిఎఫ్



రణభేరి పోస్టర్లను విడుదల చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

**ప్రజాశక్తి-రాయచోటి అర్బన్**

సంవత్సరాల తరబడి అపరిష్కృతంగా వున్న ఆర్థిక, విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 15 నుంచి 19 వరకు రాష్ట్ర వ్యాప్తంగా జరగ నున్న 'యుటిఎఫ్ రణభేరి' జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్ పిలుపు నిచ్చారు. శనివారం రాయచోటిలో యుటిఎఫ్ జిల్లా కార్యాలయం వద్ద రణభేరికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి సర్వీసు రూల్స్ సమస్యకు పరిష్కారం చూపడం లేదని, బదిలీలు, ప్రమోషన్లు పూర్తయి మూడు నెలలు కావస్తున్నా ఉపాధ్యాయులు ఇంకా పాత స్థానాల్లో కొనసాగు తున్నాం న్నారు. మూడు నెలలుగా మినిమం టైం స్కేలు టీచర్లకు జీతాలు లేకున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వాలు మారినా ప్రపంచ బ్యాంక్ సాల్ట్ పథకం రాష్ట్రంలో అమలు చేయడం ద్వారా 3వ వంతు ప్రైమరీ స్కూళ్ళు ఇప్పటికే సింగిల్ టీచర్ స్కూళ్లుగా మారిపోయాయని, సగంపైన హైస్కూళ్లు సింగిల్ సబ్జెక్టు టీచరు స్కూళ్లుగా తయారయాయని తెలిపారు. హైస్కూళ్లలో పని చేయాల్సిన స్కూలు అసిస్టెంట్లు సర్ ప్లస్ పేరుతో క్లస్టరు టీచర్లుగా, ప్రైమరీ స్కూలు హెడ్మాస్టర్లుగా పనిచేయాల్సిన పరిస్థితులు కల్పించారని తెలిపారు. నాణ్యమైన విద్యనందిస్తామని చెబుతూనే ప్రభుత్వ పాఠశాలల నుండి విద్యార్థులు ప్రైవే టుకు తరలిపోయేలా కార్యక్రమాలు రూపొంది స్తున్నారని, విద్యా సంవత్సరం ప్రారంభంలోనే 'యోగాంధ్ర', 'మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్' అంటూ బోధనకు ఆటంకం కలిగించే పని కావాలని చేస్తున్నారని విమర్శించారు. ఆన్‌లైన్, అప్‌లోడింగ్ విద్యాశక్తి కార్యక్రమాన్ని మార్చివేసి, స్వచ్ఛందం అంటూనే ఉపాధ్యాయులను ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు. పరీక్షల మూల్యాంకనాన్ని ఉపాధ్యాయులకే పరీక్షగా మార్చేసారన్నారు. మరోవైపు ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయంగా ఇవ్వాల్సిన 12వ పిఆర్‌సి ఊసే లేదని, ఈ కాలంలో కనీసం ఒక్క డిఎ కూడా ఇవ్వకపోగా, వేలాది కోట్లుగా పేరుకుపోయి బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారో తెలియని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. సిపిఎస్ రద్దు విషయం మాట్లాడక పోగా , కేంద్ర ప్రభు త్వం ఇచ్చిన మెమో 57 సైతం అమలు చేయడం లేదని తీవ్రంగా విమర్శించారు.ఆర్థిక సమ స్యలతో బాటు విద్యారంగ సమస్యలను సత్వ రమే పరిష్కరించాలని, ఉపాధ్యాయులు స్వే చ్ఛాయుత వాతావరణంలో బోధనపై కేంద్రీక రించే పరిస్థితులను కల్పించాలని డిమాండ్ చేస్తూ యుటి యఫ్ చేపట్టిన ఈ కార్యక్రమానికి ఉపాధ్యా యులందరూ మద్దతు ఇవ్వాలనికోరారు. కార్యక్రమంలో యుటియఫ్ జిల్లా కార్యదర్శులు పి.వెంకట సుబ్బయ్య, వై.శ్రీధర్‌రెడ్డి, కె.ఫణీంద్ర కుమార్‌యాదవ్, రాష్ట్ర కౌన్సిలర్ డి.చెంగల రాజు,సీనియర్ నాయకులు లక్ష్మి కుమార్, నాగేశ్వర్ గౌడ్, మండలాల అధ్యక్ష ప్రధాన కార్య దర్శులు నాగేంద్ర, మనోహర్, రామమూర్తి, శంకర్, శశికిరణ్, అమీన్, నాగార్జున, శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.



అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

## రైతులను అవహేళన చేయడం దారుణం : వైసిపి

**ప్రజాశక్తి - రాయచోటి టౌన్**

రైతులు యూరియా కోసం క్యూలో నిలబడితే బఫే ఏర్పాటు చేయాలా అంటూ వ్యవసాయ శాఖ మంత్రి రైతులను అవహేళన చేయడం దారుణమని వైసిపి జిల్లా అధ్యక్షులు ఆకేపాటి అమరనాధరెడ్డి, పరిశీలకులు సురేష్‌బాబు పేర్కొన్నారు. శనివారం వైసిపి కార్యాలయంలో ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై అన్నదాత పోరు రైతన్నకు బాసటగా పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి వేలకోట్లు ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసి రైతులను అన్ని విధాల ఆదుకున్నామన్నారు. యూరియాతో సహా రైతులకు అవసరమైన ఎరువులను వెంటనే పంపిణీ చేయాలన్నారు. బ్లాక్ మార్కెట్ ను నియంత్రించి ఎరువులు పక్కదోవ పట్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఉచిత పంటల బీమాను పునరుద్ధరించి వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. వర్షాల కారణంగా పంటలు దెబ్బతిన్న రైతులకు వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని రైతు సమస్యల పరిష్కారంపై ఈ నెల 9న కలెక్టర్ వద్ద జరిగే అన్నదాత పోరు కార్యక్రమాన్ని పోరు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు ఆరం రెడ్డి, కౌన్సిలర్లు, వీరబల్లి, సుండుపల్లి మండలాల వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైద్య కళాశాలల ప్రయివేటీకరణ ఆపాలి : 'గడికోట'

**ప్రజాశక్తి - రాయచోటి టౌన్**

ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరణ చేయడం దుర్మార్గమని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. జనహితమే లక్ష్యంగా రాష్ట్రంలో ప్రతి పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక మెడికల్ కళాశాల ఉండాలన్న దృష్టితో గత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో సాహ సోపేత నిర్ణయంతో ఒకేసారి 17 మెడికల్ కళాశాలల ఏర్పాటు చేపట్టిందన్నారు. ఇప్పటికే 7 కళాశాలలకు ఎంసిఐ అనుమతులు లభించగా, మిగిలిన 10 కళాశాలలలో పులివెందుల తదితర కళాశా లలకు ఎంసిఐ అనుమతులు ఇస్తే కూటమి ప్రభుత్వం స్వయంగా వాటిని తోసి పుచ్చిందన్నారు. ఈ ఆసదవకాశాన్ని వినియోగించు కోకుండా వద్దని లేఖ రాసి ప్రయి వేటు పరం చేయాలన్న నిర్ణయం తీసుకోవడం వెనుక వాణిజ్యపు లాభం, కమిషన్ల కోరిక తప్ప ప్రజలపై బాధ్యత అనే భావన లేద న్నారు. ఒక మెడికల్ కళాశాల నుంచి రూ 500కోట్ల నుంచి రూ.1000 కోట్ల వరకు కమీషన్లు తీసుకునేటటువంటి ప్రక్రియలో భాగంగానే డబ్బు ఆశతోనే ప్రయివేట్ పరం చేయడం దుర్మార్గమన్నారు. వైద్య వృత్తి చేపట్టాలనే సంకల్పం ఉన్న విద్యా ర్థులు రష్యా, ఉక్రెయిన్, ఫిలిఫిన్స్ వంటి దేశాలకు వెళ్లాల్సి వస్తోందని అన్నారు. పిల్లల చదువుల కోసం తల్లిదండ్రులు తమ పొలాలు,ఆస్తులను అమ్ముకుంటూ అప్పుల ఊబిలోపడిపోతున్నారన్నారు. విద్యను మెరుగపరచాలన్నదిగా నాయకుడు ఆలోచనలు చేయాలే కానీ, దాన్ని నిర్వీర్యం చేయాలన్న ఆలోచనలు ఒక్క చంద్రబాబు నాయుడే చేస్తున్నారన్నారు.

# 13న జాతీయ లోక్ అదాలత్ : జడ్జి



పీలేరు : మాట్లాడుతున్న న్యాయమూర్తి జియావుద్దీన్‌షేక్

**ప్రజాశక్తి-పీలేరు**

ఈనెల 13న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేద్దామని పీలేరు ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి జియావుద్దీన్ షేక్ తెలిపారు. రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు పీలేరు ఇన్‌ఛార్జి 11వ అదనపు జిల్లా జడ్జి సూర్య నారాయణమూర్తి సూచనలతో శనివారం ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి స్థానిక కోర్టు ఆవరణంలో పోలీసు శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ పీలేరు కోర్టు ఆవరణంలో 13న రెండవ శనివారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నామని తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో సివిల్, క్రిమినల్, మోటార్ వాహన, కుటుంబ తగాదాలు, చెక్ బౌన్స్, బ్యాంక్, బిఎస్ఎన్ఎల్ కేసులు పరిష్కరించడం జరుగుతుందని చెప్పారు. దీనికి న్యాయవాదులు, బీమా అధికారులు, కక్షిదారులు అందరూ సహకరించాలని కోరారు. జాతీయ లోక్ అదాలత్ లో ఎక్కువగా రాజీకి అవకాశం ఉండే క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు.కార్యక్రమంలో పీలేరు, కలకడ సిఐలు యుగంధర్, బి.లక్ష్మన్న, ఎర్రవారిపాలెం, భాకరాపేట, సదుం, రొంపిచర్ల ఎస్సైలు, కోర్టు లైజనింగ్ ఆఫీసర్, కోర్టు కానిస్టేబుళ్ళు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** ఈ నెల 13 న జరిగే జాతీయ లోక్ అదాలత్ ను జయప్రదం చెయ్యాలని 3వ అదనపు జిల్లా జడ్జి ప్రవీణ్ కుమార్ అన్నారు, పోలీసు అధికారులు, బ్యాంకు అధికారులు, బీమా కంపెనీల వారితో కోర్టు హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ అన్ని రాజీ కావలసిన కేసులలో కక్షిదారులను పిలిపించి రాజీ చేసుకునే విధంగా ఆయా అధికారులు కృషి చేయాలన్నారు. వీలైనంత త్వరగా కేసులను పరిష్కరించుకొని కక్షిదారులు ప్రశాంతంగా జీవించాలని తెలిపారు. రాజీ మార్గమే రాజా మార్గమని, కక్షిదారులు తమ వివాదాలు పరిష్కరించుకోవాలని, దీనికి జాతీయ లోక్ అదాలత్ మంచి వేదికని తెలిపారు. సమావేశంలో పోలీస్ అధికారులు, బ్యాంకు అధికారులు మరియు బార్ అధ్యక్షులు హనుమంతు నాయుడు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## టీ తాగుతూ..చర్చించుకుందాం

**ప్రజాశక్తి-రాయచోటి**

ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి టీ తాగుతూ చర్చించుకుందామని ఎపిజిఎ జిల్లా అధ్యక్షులు డాక్టర్ డి.లక్ష్మీప్రసాద్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని భూగర్భ జల శాఖ కార్యాలయంలో ఉద్యోగులతో రండి టీ తాగుదాం మాట్లాడుకుందాం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార మార్గాన్ని అన్వేషిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కెఆర్.సూర్యనారాయణ నూతనంగా టీ తాగుతూ చర్చించుకుందాం అనే కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. గత పాలకులు ఉద్యోగులకు రావాల్సిన పిఆర్‌సి, అరియర్, డి.ఎ అరియర్ వాటిని పట్టించుకోలేదన్నారు. మూడు సంవత్సరాల సరెండర్ లీవ్స్ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఉద్యోగులను పట్టించుకోని ప్రభుత్వాలు మనకెందుకని కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టడం జరిగిందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పైబడిన ఇంకా ఉద్యోగుల సమస్యలపై స్పందించకపోవడం ఆవేదన కలిగి స్తోందన్నారు. ఇప్పటికే ఉద్యోగులకు సుమారు రూ.25 వేలకోట్లు ప్రభుత్వం బకాయి ఉందని ఈ మొత్తాన్ని ఎలా తీరుస్తారో అర్థం కావడం లేదన్నారు. గడచిన ఐదేళ్ల కాలంలో రిటైర్డ్ అయిన ఉద్యోగులకు ఇంతవరకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందలేదని వారు వారి పిల్లలకు వివాహ కార్యక్రమాలు చేసుకోలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండల కేంద్రంలో ఉద్యోగులకు ఇంటి స్థలాలను కేటాయించి ఇళ్లు నిర్మించి ఇచ్చి ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను జమచేసుకోవాలన్నారు. ఉద్యోగులు ముక్త కంఠంతో ఏకగ్రీవం తెలిపారు. సత్వరమే ఉద్యోగుల బకాయిల చెల్లింపునకు మార్గాన్ని ఆలోచించాలని కోరారు. కార్యక్రమంలో రాయచోటి తాలూకా అధ్యక్షులు సాయికుమార్, తాలూకా కార్యదర్శి సుజిత్‌డాల్, భూగర్భజల శాఖ, ఉద్యానవన శాఖ, మత్స్య శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో వైవీయూకు ఉన్నత స్థానం : విసి

**ప్రజాశక్తి-కడప అర్బన్ :** బోధన పరిశోధన సేవ అనే దృక్పథంతో ఏర్పాటైన యోగి వేమన విశ్వవిద్యాలయం అనతి కాలంలోనే అత్యున్నత ప్రమాణాలతో పరిశోధనలతో ప్రముఖ విశ్వవిద్యాలయంగా కీర్తిని అందుకుందని విసి ఆచార్య అల్లం శ్రీనివాసరావు వెల్లడించారు. శనివారం విసి ఛాంబర్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరిశోధన అభివృద్ధి, ప్లేస్మెంట్. ఔట్ రీచ్ అండ్ ఇన్ క్లూసివిటీ, పీర్ పర్సెప్షన్ అంశాలను ప్రామాణికంగా తీసుకుని కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ర్యాంకు లను విడుదల చేసిందన్నారు. దేశంలో స్టేట్ పబ్లిక్ యూనివర్సిటీస్ 500 పైన ఉండగా అందులో వైవీయూ 51 నుంచి వందలోపు ర్యాంకు దక్కించుకోవడం విశ్వవిద్యాలయ సమష్టి కృషికి నిదర్శనమని తెలిపారు. 2006లో ఏర్పాటైన వైవీయూ పాత విశ్వవిద్యాలయాలైన అనంతపురం జెఎన్‌టియు, ఎస్కెయు, పద్మావతి విశ్వవిద్యాలయం వంటి వాటి సరసన నిలవడం అభివృద్ధికి నిదర్శనమన్నారు. సెంట్రల్ యూనివర్సిటీ పరిధిలో సెవెన్ స్పోక్ యూనివర్సిటీస్ ఎంపిక చేయగా వాటిలో రెండవది వైవీయూ కావడం గర్వకారణమన్నారు. పరిశోధనకు రూ.10 కోట్ల నిధులు రానున్నాయన్నారు. ప్రధానమంత్రి ఉచ్చరత్ శిక్ష అభియాన్ కింద రూ.20 కోట్లు నిధులు వచ్చాయని తెలినపారు. తాజాగా స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డు పొందిన ప్రొఫెసర్ కెఎస్‌వి కృష్ణారావు, ప్రొఫెసర్ రియాజున్నీసాను విసి అభినందించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ కులసచివులు ఆచార్య పి.పద్మ, ఇంటర్నల్ క్వాలిటీ అసూరెన్స్ సెల్ (ఐక్యూ ఏసీ) సంచాలకులు డాక్టర్ ఎల్.సుబ్రహ్మణ్యంశర్మ, పీఎం ఉషా సమన్వయకర్త డాక్టర్ టి.చంద్ర శేఖర్, ఐక్యుఎసి అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ సుభోస్ చంద్ర, సభ్యులు డాక్టర్ దాక్షాయని, వెంకటేశ్వర్లు, ప్రజాసంబంధాల విభాగం సంచాలకులు పి.సరిత, డాక్టర్ కె.శ్రీనివాసరావు, టి.సురేష్‌బాబు పాల్గొన్నారు.

## నేత్రదానంతో అంధుల జీవితాల్లో వెలుగులు

**ప్రజాశక్తి-వాల్మీకిపురం**

నేత్రదానం చేద్దాం..అంధుల జీవితాలలో వెలుగులు నింపుదామని వాల్మీకిపురం ప్రభుత్వాసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మాలతి అన్నారు. 40వ జాతీయ నేత్రధాన పక్షోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద ర్యాలీ నిర్వహించి, నేత్రధానంపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒకరు నేత్రధానం చేయడం వలన ఇద్దరి జీవితాలకు వెలుగులు వస్తాయని పేర్కొన్నారు. మన దేశంలో నేటికి 1.2మిలియన్ల మంది కార్నియల్ అంధత్వంతో బాధపడుతున్నారని పేర్కొన్నారు. ప్రతి ఏడాది 20 వేల నుంచి 30 వేల కొత్త కేసులు నమోదు అవుతున్నాయని తెలిపారు. ఏ వయస్సు వారైనా నేత్రధానం చేయవచ్చునని, షుగర్, బిపి, ఉబ్బసం, కంటి శుక్లాల ఆపరేషన్ చేయించుకున్న వారు కూడా నేత్రధానం చేయవచ్చునని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి నేత్రదానం చేసేందుకు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది సుధాకర్, నాగిరెడ్డి, విజ్ఞాన్, భాస్కర పాల్గొన్నారు.

## నిరాశే!

ప్రజా'దృష్టి'

జిల్లాలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు తీవ్ర నిరాశను కలిగించాయి. ఈ నెల ఒకటిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాజంపేటలో పర్యటించిన సంగతి తెలిసిందే. 30 ఏళ్ల కిందట ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా రాజంపేటలో పర్యటించినట్లు గొప్పగా ప్రకటించారు. ఇటువంటి చారిత్రక సందర్భంగా రాజంపేట నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి రోడ్‌మ్యాప్ లాంటి ప్రకటన చేస్తారని ఆశించిన వారికి నిరాశే మిగిలింది. రాజంపేట టిడిపి ఇన్‌ఛార్జి జగన్మోహన్‌రాజు రాజంపేట పట్టణాభివృద్ధికి సంబంధించి జాతీయ రహదారులను కలుపుతూ రింగ్‌రోడ్డు ఏర్పాటు చేయాలని, మెడికల్ కళాశాలను మంజూరు చేయాలని ప్రతిపాదన చేయడం వరకు బాగానే ఉంది. మెడికల్ కళాశాల వరకు హామీని పరిమితం చేసి వెళ్లిపోవడం విస్మయాన్ని కలిగించింది. తన జీవితంలో అరుదైన ఘట్టానికి తొలి వేదికగా మారిన రాజంపేటను నిరుత్సాహపరచడం, మోసం చేసిన వైసిపి ఓటేసి జిల్లాను ఇవ్వమంటారా అని ప్రశ్నించడం హతాశులను చేసింది. ఇంతటి సీనియర్ నాయకులు ఇటువంటి చౌకబారు రాజకీయ వ్యాఖ్యలు చేయడం ఏమిటనే విమర్శలకు ఆస్కారాన్ని కలిగించడం దారుణం. జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో జిల్లా ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార మార్గం చూపుతారని ఆశించిన వారికి నిరాశను కలిగించారని చెప్పవచ్చు. జిల్లాలో చీనీ, ఉల్లి ధరలు అమాంతం పడిపోయాయని, వ్యాపారుల ఇష్టారాజ్యం సాగడమే కారణమనే విమర్శలు ఉన్నాయి. ఇటువంటి అంశాన్ని ప్రస్తావించిన వైసిపి జడ్‌పిటిసిల ప్రశ్నలకు, అధికార పార్టీ ఎమ్మెల్సీ నుంచి ఎదురుదాడి జరగడం విస్మయాన్ని కలిగించింది. ఉద్యాన పంటల ధరల పతనాన్ని నివారించలేకపోతే మిన్నకుండి పోవాలి గానీ, ఎదురుదాడి చేయడం ఏమిటని రైతాంగం ప్రశ్నిస్తోంది. జిల్లా రెవెన్యూ యంత్రాంగం చేసిన తప్పిదాలకు అర్హులకు అన్నదాతా సుఖీభవ, తల్లికి వందనం వంటి పథకాలు అందడం లేదనే వాదన వినిపిస్తోంది. సర్వే దశలో జరిగిన తప్పి దాలే కారణమని కలెక్టర్ చెప్పినప్పటికీ, అర్హులకు జరిగిన అన్యాయాన్ని ఎలా సరిదిద్దాలో ఆలోచించకపోవడం ఆందోళన కలిగిం చింది. రెవెన్యూ యంత్రాంగం తప్పిదాల కారణంగా ఎందరో అర్హులకు సంక్షేమ పథకాలు అందని పరిస్థితి నెలకొంది. బాధ్యులపై ఎటువంటి చర్యలు తీసుకోవడం గానీ, ఇటువంటి సమస్యల పరిష్కారానికి మార్గాన్వేషణ చేయకపోవడం ఏమిటో తెలియని పరిస్థితి నెలకొంది. ఇటీవల కేబినెట్ సమావేశంలో పులివెందుల మెడికల్ కళాశాలను ప్రయివేటు పరం చేస్తూ నిర్ణయం తీసుకోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. ప్రభుత్వం నడపలేని వైద్య కళాశాలను ప్రయివేటు సంస్థలు ఎలా నడుపుతాయో ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

**- ప్రజాశక్తి - కడప ప్రతినిధి**


నిమ్మనపల్లె: సన్మానం పొందిన ఉపాధ్యాయులు

## ఉపాధ్యాయులకు సన్మానం

**ప్రజాశక్తి-నిమ్మనపల్లె**

మండల కేంద్రమైన నిమ్మనపల్లిలోని ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో శనివారం ఘనంగా గురుపూజోత్సవాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కరన్ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంఇఒలు పద్మావతి, నారాయణ, మాజీ ఎంపిపి రెడ్డప్ప రెడ్డి, ఎస్ఎంసి చైర్మన్ మమత పాల్గొన్నారు. పాఠశాలలోని విద్యార్థులకు గురువుల ప్రాముఖ్యత, సత్ప్రవర్తన, ఉన్నత భవిష్యత్తుకు తీసుకోవలసిన నిర్ణయాలపై వివరించారు. అనంతరం మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా సన్మానం అందుకున్న ఉపాధ్యాయులను కేమాధవి పాఠశాల బృందం ఘనంగా సత్కరించారు. నిమ్మనపల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆదర్శ ప్రాథమిక పాఠశాలగా ఈ ఏడాది ప్రభుత్వం ఉన్నతీకరించడం జరిగిందన్నారు. ఇందులో మొదట విద్యార్థులు 36 మంది ఉండగా ప్రస్తుతం సుమారు 90 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని అన్నారు. మండలంలో అత్యధిక విద్యార్థుల నమోదు కలిగిన ప్రాథమిక పాఠశాలగా నిమ్మనపల్లి ఆదర్శ పాఠశాల నిలుస్తున్నదన్నారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న ఉపాధ్యాయులను ఎంఇఒ లు, ఎంఆర్‌సి సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గుర్రప్ప, సుధాకర్, మాధవి, ఎంఆర్సి సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. **కలికిరి:** ఉపాధ్యాయుల దేశ భవిష్యత్తు నిర్దేశకులని ఇండియన్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ ఆదినారాయణరెడ్డి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని శనివారం ఇండియన్ పబ్లిక్ స్కూల్లో కరస్పాండెంట్ సుజాత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల, దేశ భవిష్యత్తు నిర్దేశకులు ఉపాధ్యాయులని పేర్కొన్నారు. కరస్పాండెంట్ సుజాత మాట్లాడుతూ ఉపాధ్యాయులందరూ సర్వేపల్లి రాధాకృష్ణ అడుగుజాడల్లో నడిచి దేశ అభివృద్ధికి పునాదులు వేయాలని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో సిబ్బందికి ఆటలు పోటీలు నిర్వహించి వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు షాహిన, నాగజ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **పీలేరు :** గురువులను గౌరవించడం మనందరి కర్తవ్యమని పీలేరు ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి జియావుద్దీన్ తెలిపారు. శనివారం పీలేరు పట్టణం, కోటపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సుకు న్యాయమూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు గురుపూజోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే వారితో గురుపూజోత్సవ విధి విధానాల గురించి ముచ్చటించారు. తల్లి తండ్రి తరువాత ఒక దైవంగా భావించేది గురువులనే అని, వారు ఈ దేశానికి వెన్నెముకని అన్నారు. విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులు, గురువులు, పాఠశాలకు మంచి పేరు, ప్రఖ్యాతలు తెస్తూ, భావితరాలకు ఉపయోగపడేలా ఎదగాలని, అప్పుడే దేశానికి కూడా మంచి పేరు వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కోటపల్లి బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 10న మెగా జాబ్‌మేళా

**ప్రజాశక్తి-రామాపురం**

ఈనెల 10న ఎపి స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రాయచోటిలోని శ్రీశివ నర్సింగ్ కళాశాలలో మెగా జాబ్ నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల చైర్మన్ మన్మోహన్ భాస్కర్ తెలిపారు. యాక్సిస్, ఐసిసిఐ బ్యాంక్, షిరిడి సాయి ఎలెక్ట్రికల్స్, కామెట్ స్టార్ సొల్యూషన్స్, టాటాఎలెక్ట్రికల్స్, అపోలో ఫార్మసీ, యంగ్ ఇండియా, డిక్సన్, శ్రీరామ చిట్స్ కంపెనీలు హాజరవుతున్న తెలిపారు. జిల్లాలోని ఆసక్తి గల నిరుద్యోగ యువత ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఆసక్తిగల అభ్యర్థులు ఈ లింక్‌లో https//naipunyam.ap.gov.in/user-registration దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## కాంట్రాక్టు పద్ధతిపై ఉద్యోగ అవకాశాలు

**ప్రజాశక్తి-కలికిరి**

శాంభవి మ్యాన్ పవర్ సంస్థ ద్వారా ఉమ్మడి చిత్తూరు జిల్లా కోర్టులలో కాంట్రాక్టు పద్ధతిపై హౌస్ కీపింగ్, సూపర్‌వైజర్ ఉద్యోగ అవకాశాలు కల్పించ బడునని సంస్థ చైర్మన్ జైపాల్ తెలిపారు. జిల్లా లోని 14 కోర్టు కార్యాలయాలలో హౌస్ కీపింగ్ పని చేయుటకు నెలకి జీతం రూ.12,384లు, సూపర్వైజర్‌కు రూ.22,391 లు ఇవ్వబడుతుందని తెలిపారు. వీరికి పిఎఫ్ , ఈఎస్ఐ కూడా వర్తి స్తాయని చెప్పారు. చిత్తూరు, తిరుపతి, మదనపల్లి, పీలేరు, శ్రీకాళహస్తి, పుత్తూరు, పుంగనూరు, పలమనేరు, కుప్పం, తంబళ్లపల్లి, పాకాల, వాయల్పాడు, నగిరి, సత్తి వేడు, ప్రాంతాలలో ఉన్న కోర్టుల్లో ఈ హౌస్ కీపింగ్ ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ ప్రాంతాలలో ఉన్న స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని చెప్పారు. 5వ తరగతి నుంచి పదవ తరగతి వరకు చదువుకున్న వారు, వయస్సు 20 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాలలోపు ఉన్నవారు దరఖాస్తులు చేసుకో వచ్చునని తెలిపారు. 10-9-2025వ తేదీ నుంచి 20-9 -2025 వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇంటర్వ్యూకు వచ్చేటప్పుడు ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ పాస్‌బుక్, నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకుని రావాలని సూచించారు.సమాచారం కోసం 8008975306 ఫోన్ నెంబర్ కు ఫోన్ చేసి సంప్రదించవచ్చని తెలిపారు.

## ముస్లిం యువకుడికి హెల్పింగ్ మైండ్స్ అంత్యక్రియలు

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

సొంత కుటుంబ సభ్యులు, రక్తసంబంధికులు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఇస్లాం మతానికి చెందిన యువకుడి అంత్యక్రియలను హెల్పింగ్ మైండ్స్ బృందం నిర్వహించారు. మదనపలిలో చిత్తు కాగితాలు ఎరుకొని జీవనం సాగించే యువకుడు రెండు రోజుల క్రితం స్థానిక ఇందిరానగర్‌లో మృతి చెందాడు. రెండో పట్టణ పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో పెట్టారు. మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు ఎవరూ ముందుకు రాకపోవడంతో హెల్పింగ్ మైండ్స్ సభ్యులు అబూబక్కర్ సిద్దిక్, యూసుఫ్, కమ్మల ఆనంద్, ఫయాజ్, గౌస్, నవీన్, వెల్డింగ్ గౌస్ బాషా మృతదేహానికి ఖబరస్థాన్ ఇస్లాం సంప్రదాయంగా అంత్యక్రియలు నిర్వహించారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**ప్రజాశక్తి-గాలివీడు**

రోడ్డు ప్రమాదంలో గాయపడి వేలూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని గోరాన్ చెరువు పంచాయతీ వడిసెలవంకపల్లెకు చెందిన పగిడిపల్లి ఖాదర్‌వలీ(24) శనివారం మృతి చెందాడు. మృతుడు గుర్రంకొండలో జ్యూస్ ఫ్యాక్టరీలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. రెండు నెలల క్రితం కడప నిరంజన్‌కాలనీలో రేష్మను యువతితో వివాహం జరిగిందని తెలిపారు. వివాహం జరిగి రెండు నెలల్లోనే భర్త మృతి చెందడంతో భార్య రేష్మ కన్నీరు మున్నీ రుగా విలపిస్తోంది. కుటుంబ రోదనలు మిన్నంటాయి. గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి. మృతుని కుటుం బానికి గ్రామ ప్రజలంతా నివాళులర్పించారు.

## పేదల సమస్యలపై పోరాడాలి : ఎంపిజె

**ప్రజాశక్తి - ఎర్రగుంట్ల**

ముదునూరు రోడ్డులోని జామియా మసీదులో ఎంపిజె (మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్) అనే స్వచ్ఛంద సేవా సంస్థకు సంబంధించి ఎర్రగుంట్ల మండల కమిటీని శనివారం ఎన్నుకున్నారు. ఎంపిజె రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలీం, రాయలసీమ ఇన్‌ఛార్జి అయూబ్ ఖాన్, జిల్లా అధ్యక్షులు జాకీర్ ఉమ్రి ఆధ్వర్యంలో కమిటీని ఎన్నుకున్నారు. ఎంపిజె పట్టణ అధ్యక్షులుగా కమల్ బాషా, ఉపాధ్యక్షులుగా జుబేర్, కార్యదర్శిగా షరీఫ్, సహాయ కార్యదర్శులుగా చాంద్‌బాషా, మునీర్ అహ్మద్, కోశాధికారిగా బికారి సాహెబ్, పలువురు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎంజిఎ ప్రధాన కార్యదర్శి సలీం మాట్లాడుతూ మండలంలో పేద ప్రజల సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో గుర్రంబండి దస్తగిరి, బాబావలి, రఫీ, మున్నా, షాహిద్, అబ్దుల్, రసూల్, మహబూబ్ పీర్, పెద్ద కమాల్‌బాష, రియాజ్, ఖాసిం, ఇమామ్ పాల్గొన్నారు.

# మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, పిపిపి పద్ధతిలో మదనపల్లెలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్.జె వెంకటేష్ పేర్కొన్నారు. శనివారం స్థానిక టిడిపి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మదనపల్లె మెడికల్ కళాశాల విషయంలో ఎమ్మెల్యే రాజీనామా చేయాలని బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతమ్ కోరడం సరికాదన్నారు. గతంలో ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రతి పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక్క మెడికల్ కళాశాలని ఏర్పాటు చేయాలనీ, అందులో కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం వాటాతో పాలసీ తెస్తే, రాష్ట్ర వాటా నిధులను విడుదల చేయడంలో జగన్ ప్రభుత్వం విఫలం చెందడమే కాకుండా, కేంద్రం ఇచ్చిన నిధులతో అరాకొర భవనాలు నిర్మించి, మౌలిక సదుపాయాలు, సిబ్బంది నియామకాలు చేయలేకపోయిందన్నారు. దీంతో కాకినాడలో రెండవ ఏడాది తరగతులు అద్దె భవనాల్లో నిర్వహించే దుస్థితి వచ్చిందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రం ఆర్థికంగా లోటు బడ్జెటులో ఉన్నా, పబ్లిక్, ప్రయివేట్ భాగస్వామ్యంతో మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేయడానికి నిర్ణయం తీసుకుందని తెలిపారు. మదనపల్లెలో వంద పడకల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఉన్నా, మెరుగైన వైద్యం కావాలంటే తిరుపతి, బెంగుళూరు, చెన్నై వంటి దూర ప్రాంతాలకు వెళ్ళవలసి


మాట్లాడుతున్న ఆర్‌జె.వెంకటేష్

వస్తోందని, ఈ పరిస్థితిలో మెడికల్ కళాశాల సేవలు అందుబాటులోకి వస్తే ఇక్కడే వైద్యం పొందే అవకాశం కలుగుతుందన్నారు. వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ 60శాతం వికలత్వం ఉన్నవారికి పెన్షన్లు తొలగిస్తున్నారని చేసిన ఆరోపణలు అర్థరహితమన్నారు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం కారణంగా యూరియా సరఫరా తగ్గిందని, ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకుని అందించే విధంగా కృషి చేసిందన్నారు. కార్యక్ర మంలో టిడిపి నాయకులు విజయమ్మ, నాగమణి, ప్రమీల,మల్లికార్జున,ఉషారాణి, భువనేశ్వర్‌రెడ్డి, పాల్గొన్నారు.

# బాల్య వివాహాలను అరికట్టాలి


మాట్లాడుతున్న అరుంధతిరెడ్డి

**ప్రజాశక్తి-కలికిరి**

బాల్య వివాహాలను అరికట్టాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు అరుంధరెడ్డి, సర్తాజ్ పేర్కొన్నారు. మండల కేంద్రం కలికిరిలో శనివారం జడ్‌పి హైస్కూల్‌లో జయమ్మ ఆధ్వర్యంలో సంకల్ప మిషన్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18సంవత్సరాల లోపు ఉన్న బాలికలు వివా హాలు చేసుకోకూడదని చెప్పారు. ఈ బాల్య వివాహాల వలన బాలికలకు ఆరోగ్యం, విద్య మంచి భవిష్యత్ దూరం అవుతాయని, అనారోగ్యం లాంటి పరిస్థితు లను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అందుకే బాల్యవివాహాలను పూర్తిగా అరికట్టాలన్నారు. పరిసర ప్రాంతాలనుశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రతను కూడా పాటించాలని సూచించారు. ఎప్పుడైనా ఎక్కడైనా బాలికలు ఇబ్బందులు పడుతున్న సందర్భాలలో చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1078కి, అత్యవసర సమాచారం కోసం 112,181 నంబర్లకు సమాచారాన్ని అందివ్వాలన్నారు. కార్యక్రమంలో ఎం ఎల్ హెచ్‌సి గీత, అంగన్వాడీ కార్యకర్త అమ్మాజీ, ఏఎన్‌ఎమ్స్, ఆశా వర్కర్లు, బాలికలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పశుపోషణ ఆవశ్యకతపై రైతులకు శిక్షణ

**ప్రజాశక్తి-పీలేరు**

ఆత్మ చిన్నగొట్టిగల్లు బ్లాక్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని తలపుల గ్రామంలో పశుపోషణ ఆవశ్యకత పై రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యులు డాక్టర్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ పాల ఉత్పత్తిని పెంచుకోడానికి పశుపోషణలో ప్రధానమైన సైలేజ్ తయారీ పద్ధతిపై రైతులకు అవగాహన కల్పించారు. సైలేజ్ విధానంలో తయారు చేసిన మేతను వాడుకోవడం ద్వారా ఆవుల పాల దిగుబడిని 2 నుంచి 3 లీటర్లు అదనంగా పెంచుకోవచ్చని చెప్పారు. పొదుగువాపు వ్యాధి రాకుండా పాలు పిండిన తరువాత తీసుకోవలసిన తగిన జాగ్రత్తల గురించి తెలిపారు. పాడి ఆవులకు ముందుగానే టీకాలు వేసుకోవడం ద్వారా గాలి కుంటు, బొబ్బల వ్యాధి సోకి జరిగే అధిక నష్టాన్ని అరికట్టవచ్చని తెలిపారు. పుట్టిన దూడలకు 10 రోజుల తరువాత నుంచి 6 నెలలు వ్యవధిలో పలు మార్లు పెరుగు మందును ఇవ్వడం వలన దూడలు ఆరోగ్యాకరమైన ఆవులుగా ఎదుగుతాయన్నారు. ఆత్మ ద్వారా ఒక కిలో మినరల్ మిక్చర్ ప్యాకెట్లు రైతులకు అందించారు. బాహ్య పరాన్న జీవులను అరికట్టే చర్యలో భాగంగా ఆవులకు


రైతులకు మినరల్ మిక్చర్ ప్యాకెట్లు అందజేస్తున్న అధికారులు

పిడుదుల మందును స్ప్రే చేయించారు. కార్యక్రమంలో ఆత్మ బిటిఎం జ్యోత్స్న, రైతులు, వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

# 30 పడకల ఆస్పత్రిగా మార్చాలని మంత్రికి వినతి

**ప్రజాశక్తి-సుండుపల్లె**

మండల కేంద్రంలోని సుండుపల్లి ప్రభుత్వ ఆస్పత్రిని 30 పడకల ఆస్పత్రిగా తీర్చి దిద్దాలని కోరుతూ శనివారం రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు రాజంపేట నియోజకవర్గ జనసేనపార్టీ నాయకులు రామ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించార. ఈ సందర్భంగా రామ శ్రీనివాస్ మాట్లాడుతూ టి.సుండుపల్లి ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రిగా మార్చాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. మండలంలో 15 గ్రామపంచాయతీలతో సుమారు లక్ష మంది జనాభా కలిగిన మండలంలో 24 గంటలు సేవలు అందించే వైద్యశాల లేదన్నారు. అత్యవసర సేవలు అవసరం అయితే కొన్ని ప్రమాదాలు జరిగితే రాయిచోటి, కడప,


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న జనసేన నాయకులు

తిరుపతి వంటి సుదూర ప్రాంతాలకు పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కొన్నిసార్లు రాత్రిపూట ప్రమాదాలు జరిగితే ప్రథమ చికిత్స అందించేందుకు కూడా అవకాశం లేకుండా పోయిందన్నారు. సమయానికి వైద్యం అందక ప్రజలకు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వంలో చర్యలు తీసు కొని 30పడకల ఆస్పత్రి నిర్మిస్తే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. 30 పడకల ఆస్పత్రి కోసం ప్రజలు ఎదు రు చూస్తున్నారని, ప్రజల ఆకాంక్ష నెరవేర్చాలని కోరా మన్నారు. మెరుగైన వైద్యం అందించాలన్నారు. మంత్రి సాను కూలంగా స్పందిం చారని పేర్కొన్నారు. కార్య క్రమంలో జనసేన, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# పరిశుభ్రత పాటించాలి : సిడిపిఒ

**ప్రజాశక్తి-వాల్మీకిపురం**

సమాజంలో ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలని వాల్మీకిపురం సిడిపిఒ భారతి అన్నారు. శనివారం మండలంలోని చింతపర్తి జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు ఋతుక్రమ, పరిశుభ్రత, ఆరోగ్యం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలకు ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు భయపడకుండా 1098, 112, 181 హెల్ప్‌లైన్ నెంబర్లకు ఫోన్ చేసి విషయాన్ని తెలియజే యాల న్నారు. అలాగే ఎవరైనా తాకరాని చోట తాకడం, అసభ్యకరంగా ప్రవర్తించడం వంటివి చేస్తే వెంటనే తల్లిదండ్రులకు గానీ, పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయులకు గానీ తెలియజేయాలన్నారు. సమాజంలో బాలికలపై జరుగుతున్న ఆకృత్యాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ భానులక్ష్మీదేవి, ఉపాధ్యాయురాలు లక్ష్మీ, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిడిపిఒ భారతి

# డ్రైయినేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం


డ్రైయినేజీ పనులను పరిశీలిస్తున్న యోగేష్‌రెడ్డి


**ప్రజాశక్తి-కలికిరి**

పట్టణంలోని క్రాస్ రోడ్డు కలకడ రోడ్డు వాసుల డ్రైయినేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం కొరకు కలికిరి అభివృద్ధి కమిటీ చైర్మన్ రెడ్డివారి యోగేష్‌రెడ్డి, ఇఒ జి.అశోక్ శనివారం పనులు చేపట్టారు. గత కొన్ని సంవత్సరాలుగా కలికిరి మేజర్ పంచాయతీలోని కలికిరి క్రాస్ రోడ్ కలకడ రోడ్డు మార్గంలో డ్రైయినేజీ లేకపోవడం వలన ఆ మార్గంలో మురుగునీరంతా అంతా రోడ్డుపై పారి దుర్గంధ భరితమై ఇటు ప్రయాణికులు, అటు స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు శాశ్వత పరిష్కారం దిశగా జెసిబితో కాలువ తీయించి డ్రైయినేజీ పనులను చేపట్టారు. మరో మూడు రోజుల్లో కాలువ నిర్మాణం పూర్తి చేసి మురుగునీటి శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలోనే అభివృద్ధి

**ప్రజాశక్తి-రాజంపేట అర్బన్**

కాంగ్రెస్ పార్టీ హయాంలోనే రాజంపేట నియోజకవర్గం అభివృద్ధి చెందిందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పూలభాస్కర్ తెలిపారు. శనివారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2004-09 మధ్యలో డాక్టర్ వై.ఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా, సాయిప్రతాప్ కేంద్ర సహాయ మంత్రిగా, ప్రభావతమ్మ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రాజంపేటను మున్సిపాలిటీగా మార్చి అభివృద్ధిని పరుగులు పెట్టించిందన్నారు. అంతకు ముందు తెలుగు దేశం పార్టీ ఆవిర్భావం నుంచి పదిహేను సంవత్సరాల కాలంలో బండారు రత్న సభాపతి అత్తిరాల పథకం, ఆల్విన్ ఫ్యాక్టరీలను సాధిస్తే, పసుపులేటి బ్రహ్మయ్య చక్రాల మడుగు పైన బ్రిడ్జి తీసుకురాగలిగారని తెలిపారు. కూటమి హయాంలో కేంద్రీయ విద్యాలయానికి స్థలం ఇవ్వలేదని, ప్రధాన రహదారి వెంట భూములు ఉన్న కంప చెట్లలో కోర్టు భవనాలకు స్థలం చూపించారన్నారు. టిడ్కో భూములు


మాట్లాడుతున్న పూలభాస్కర్

ఎక్కడున్నాయో తెలియదని, అన్న మయ్య ప్రాజెక్ట్ అతీ-గతీ లేదని, విద్యా సంస్థలు, చెరువులు ఆక్రమించినా చర్యలు లేవని విమర్శించారు. పట్టణంలో వాహన తాకిడి పెరిగి అడుగ డుగునా అడ్డంకులున్నా పరిష్కారాలు లేవని అన్నారు. వైద్య కళాశాల లేదని, జిల్లా అడిగితే ప్రజలు ఓట్లు వెయ్యలేదని ముఖ్యమంత్రి అనడం బాధాకరమన్నారు. వైసిపిని మించి కూటమి రాజంపేటకు అన్యాయం చేస్తోందన్నారు. రాజంపేటలో ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాలలో నడుస్తున్నాయని అన్నారు.


భూములను పరిశీలిస్తున్న దేవాదాయ సహాయ కమిషనర్ విశ్వనాథం

## మఠం భూములను పరిరక్షించాలి

**ప్రజాశక్తి-కలికిరి**

శివయోగి మఠం భూములను పరిరక్షించాలని దేవాదాయశాఖ సహాయ కమిషనర్ విశ్వనా థం తెలిపారు. ఎమ్మెల్యే కిషోర్ కుమార్‌రెడ్డి ఆదేశాలు మేరకు జంగమ సంక్షేమ సం ఘం చైర్మన్ వాసునూరి చంద్రశేఖర్ తో కలిసి మేడుకుర్తి క్రాస్‌లోని శివయోగి మఠం భూములను పరిశీ లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివయోగి మఠం భూములును అన్యాక్రాంతం నుండి రక్షించి వినియోగంలోకి తీసుకురావడానికి మఠం భూములను పరిశీలించి రెవెన్యూ వారికి తగు ఆదేశాలు జారీ చేశారు.ధూపదీప నైవేద్యం కింద ఎంపికైన టువంటి దేవాలయాలను పరిశీలించారు. కార్యక్రమంలో రెడ్డయ్య పాల్గొన్నారు.


పోస్టు కార్డులను పంపుతున్న వైసిపి నాయకులు

## యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం

**ప్రజాశక్తి-కంభంవారిపల్లి**

యూరియా సరఫరాలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి గుండ్లూరు జయరామచంద్రయ్య పేర్కొన్నారు.శనివారం మండలంలో రైతులు పోస్టుకార్డు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో శ్రమించి వరి నాట్లు వేసుకున్నామని యూరియా ప్రభుత్వం సరఫరా చేయ కపోవడంతో వ్యాపారస్తులు బ్లాక్ మార్కెట్లో అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిఎం చంద్రబాబు యూరియా కొరతపై వక్రీకరించి మాట్లాడడం బాధా కరమన్నారు. ఇప్పటికైనా రైతుల బాధలను గుర్తించి ప్రభుత్వం వెంటనే యూరియాను సరఫరా చేసి రైతులను ఆదుకో వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైసిపి పంచాయతీ రాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దిగవగళ్ళ శ్రీనివాసులురెడ్డి, బిసి జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, ఎస్‌టి సెల్ జిల్లా నాయకులు బి.రమేష్, మైనార్టీ నాయకులు సైపుల్లా, అల్తాఫ్ రైతు నాయకులు హర్షవర్ధన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, ఖాదర్‌బాషా, రామ కొండారెడ్డి, కిరణ్ నాయుడు, మాజీ ఎంపిపి నాగేశ్వర, సుగుణమ్మ పాల్గొన్నారు.

## మెడికల్ ఆఫీసర్‌గా డాక్టర్ మాలతి

**ప్రజాశక్తి-వాల్మీకిపురం**

వాల్మీకిపురం ప్రభుత్వాసుపత్రి మెడికల్ ఆఫీసర్‌గా డాక్టర్ మాలతి శనివారం ఉద్యోగ బాధ్యత లు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న మెడికల్ ఆఫీసర్ రవికుమార్ అనకాపల్లికి బదిలీ కావడంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్‌గా ఉన్న మాలతి మెడికల్ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రికి వచ్చే వారందరికీ అందు


బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ మాలతి

బాటులో ఉంటూ వారికి మెరుగైన వైద్యం అందిస్తామన్నారు. కార్పొరేటు వైద్యంకు ధీటుగా ప్రభుత్వాసుపత్రిలో వైద్య సేవలు అందిస్తామన్నారు. ప్రజలు ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లకుండా ప్రభుత్వాసుపత్రుల్లోనే వైద్య సేవలు పొందాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు డాక్టర్లు ఆమెకు అభినందనలు తెలిపారు.

## అర్థమయ్యేలా విద్యా బోధన

**ప్రజాశక్తి-తంబళ్లపల్లి**

మండల కేంద్రం తంబళ్లపల్లిలోని బాలుర గురుకుల పాఠశాలను శనివారం ఆలిండియా ఎరుకుల హక్కుల పోరాట సమితి జాతీయ కమిటీ సభ్యుడు అమా వాస్య రమణ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు పిల్లల విద్య వైద్యం సౌకర్యాల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి విద్యార్థులకు సైన్స్ టీచర్, ఇంగ్లీష్ టీచర్ లేకపోవడం వలన పదవ తరగతి విద్యార్థులు ఇబ్బంది పడు తున్నారని అన్నారు. 150 మంది పిల్లలు ఉండాల్సిన చోట కేవలం 45 మంది మాత్ర మే ఉన్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు నామ మాత్రం కాకుండా గట్టిగా కృషి చేసి విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. ప్రయివేట్ స్కూళ్ల మాయలో పడి ఆర్థికంగాను, మానసికంగానూ కృంగిపోవడం కంటే అన్ని వసతులతో కలిగిన గురుకుల పాఠశాలలో చేర్పించి పిల్లల భవిష్యత్తు కొరకు మంచి నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అమావాస్య రెడ్డయ్య పాల్గొన్నారు.

## చీనీ రైతులు సంఘటితం కాకపోతే ఆత్మహత్యలే


**సింహాద్రిపురం :** రానున్న రోజులలో చీనీ రైతులు సంఘటితం కాకపోతే ఆత్మహత్యలే శరణ్యమని రాష్ట్ర రైతు సంఘం నాయకుడు వి.అరవిందనాథరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గడిచిన ఆరు నెలల కాలంలో చీనీ కాయల ధరలు రైతులకు ఏమాత్రం గిట్టుబాటు అయ్యే పరిస్థితి లేదన్నారు. మార్కెట్లో టన్ను రూ.15 వేలు విక్రయిస్తే రైతు నష్టపోయి ఆత్మ హత్యలు చేసుకునే పరిస్థితి నెలకొందన్నారు. ఇలాంటి పరిస్థితులలో చీనీ రైతులు సంఘటితమై టన్నుకు రూ30 వేలకు మాత్రమే విక్రయిస్తామని వ్యాపారులకు చెప్పాలన్నారు. పులివెందుల, అనం తపురం మార్కె ట్లలో అధిక మొత్తంలో చీనీ కాయలు మార్కెట్‌కు రావడంతో ధరలు తగ్గుతున్నాయన్నారు. గతంలో వ్యాపారస్తులు తోటలో వద్దకు వచ్చి చీని కాయలను కొనుగోలు చేసేవారు. నేడు మార్కెట్కు రైతే తీసుకుని పోవడంతో ధరలు సైతం తగ్గించి ఇస్తున్నారని ఆయన వాపోయారు. సంఘటితమైతేనే భవిష్యత్ అన్నారు.

## ప్రయివేట్ పరం శోచనీయం

**- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి**

**ప్రజాశక్తి - వేంపల్లె**

రాష్ట్రంలో ఉన్న పులివెందుల, ఆదోని, మదనపల్లె, మార్కాపురం, పార్వతీపురం, అమలాపురం, బాపట్ల, నర్సీపట్నం, పెనుగొండ, పాలకొల్లు ప్రభుత్వ వైద్య కళాశాలలకు అనుబంధంగా ఉన్న ఆస్పత్రులను ప్రయివేటు పరం చేయాలని చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం నిర్ణయించడం శోచనీయం, దురదృష్టకరమని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. శనివారం



వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రయివేటు పరం చేయడం వల్ల ఎంబిబిఎస్ సీట్లను ఆ యాజమాన్యం రూ.కోట్లకు అమ్ముకుంటారని తెలిపారు. ఇది పేద విద్యార్థులను వైద్య విద్యకు దూరం చేయడమే అవుతుందన్నారు. ప్రతిభకు పాడె కట్టడమే అవుతుందని తులసిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత ఆస్పత్రుల్లో పేదలకు ఉచిత వైద్యం లభించదని పేర్కొన్నారు. రోగులకు కూడా ప్రభుత్వం అన్యాయం చేసినట్టేనని ఆయన విమర్శించారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ వైద్య విద్యను ప్రయివేట్ పరం చేయవద్దని గతంలో చెప్పామన్నారు. అందుకు పూర్తి విరుద్ధంగా కూటమి ప్రభుత్వం వ్యవహ రించడం గర్హనీయమని పేర్కొన్నారు. ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసం హరించుకోవాలని కూటమి ప్రభుత్వాన్ని తులసిరెడ్డి డిమాండ్ చేశారు.